క్లుప్తంగా

హక్కుల సాధనకు పోరాటం



రాష్ట్ర నేతలను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం సమష్టిగా పోరాడుదామని బహుజన విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య, జేఏసీ కన్వీనర్ కట్టా వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం రాయలసీమ ఎస్సీ,ఎస్టీ,ముస్లీం మైనార్టీస్ ప్రజాసేవా సంఘం కార్యాలయంలో సదస్సు జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. జేఏసీ కోర్ కమిటీ సభ్యుడు తోట కోటేశ్వరరావు, ప్రజాసేవా సంఘం అధ్యక్షుడు ఆలంనవాజ్, నాయకులు మహేంద్ర, పప్పూర బాషా, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు వలంటీర్లకు పురస్కారాలు

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు పురస్కరాలు అందించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న గురువారం తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు.

శుద్ధ నీరు సరఫరా



ఆర్‌సీ టెస్ట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. 22వ వార్డులో తాగునీటి సమస్యలపై అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి వార్డులో పర్యటించారు. ఆర్‌సీ పరీక్షల ద్వారా నీటిలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించారు. కాగా తాగునీటి సరఫరా సమయాన్ని కొంత పెంచాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం: విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. స్పెషలాఫీసర్లు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సంక్షేమ యాత్ర

తాడిపత్రి టౌన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శుక్రవారం ఉదయం పెద్దపొలమడ గ్రామం నుంచి ప్రజా సంక్షేమయాత్ర ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

విద్యార్థులకు అనుగుణంగా భవనం కేటాయించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

గార్లదిన్నె: ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా భవనం కేటాయించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాల గదులు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, కేవలం 9 గదులు మాత్రమే ఉన్నాయని, తమకు గదులు లేవని పాఠశాల సిబ్బంది జేసీ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ ఉషారాణి, మైనార్టీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఉల్లిగడ్డల వ్యాపారి ఆత్మహత్య

అనంతపురంశ్రీకంఠంసర్కిల్/గార్లదిన్నె: వారం రోజుల క్రితం అదృశ్యమైన ఉల్లిగడ్డల వ్యాపారి శంకరయ్య గార్లదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. యాడికి మండలం, గుడిపాడుకు చెందిన బాల శంకరయ్య (48) కొన్ని రోజుల క్రితం అనంతపురానికి వలస వచ్చి ఆర్కే నగర్‌లో భార్యాపిల్లలతో కలసి నివాసముంటున్నాడు. తోపుడు బండిపై ఉల్లిగడ్డలు అమ్ముతూ జీవనం సాగించేవాడు. ఎంత వ్యాపారం చేసినా అప్పులు తీరే మార్గం కనిపించక జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ నెల 19న పనిపై గార్లదిన్నెకు వెళుతున్నట్లు భార్యకు తెలిపి బయటకు వచ్చిన శంకరయ్య ఆ తర్వాత ఇంటికి చేరుకోలేదు. భార్య సుభద్రమ్మ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం గార్లదిన్నె మండలం తిమ్మంపేట చెరువు సమీపంలో కుళ్లిన స్థితిలో శంకరయ్య మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: ప్రజలు కాలు బయటపెట్టకుండా ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని, వారిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుండెల్లో పెట్టుకున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని షాదీఖానాలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రభుత్వ సేవలు అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న వలంటీర్ల వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి వలంటీర్ పని చేస్తున్నాడన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి కమీటీలంటూ వాళ్ల కార్యకర్తలు, చోటా నాయకులు లబ్ధి పొందడానికే ఎన్నో పథకాలు తీసుకువచ్చాడే తప్ప రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే పథకాలు తీసుకురాలేదన్నారు. కానీ జగనన్న కుల,మత, పార్టీ అనే భేదాలు లేకుండా అర్హులందరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ప్రవేశపెట్టినప్పుడు తీవ్ర విమర్శలు చేసిన వారు సైతం ఇప్పుడు అభినందిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలు మరవలేనివన్నారు. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం సేవావజ్ర అవార్డును నార్పల సచివాలయం-3కి చెందిన రాంబాబును సేవావజ్ర, వీరనారప్ప, గంగాభవాని, రాజు, బ్రమేశ్వరయ్య, మధు అనే వలంటీర్లను సేవామిత్ర పురస్కారంతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, సర్పంచు మస్నీల సుప్రియ, ఎంపీపీ నాగేశ్వరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య, ఎంపీటీసీ బాలనాగి భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, కో ఆప్షన్ షాబీరా, అగ్రిబోర్డు మండల చైర్మన్ లింగారెడ్డి, డైరెక్టర్ దాడితోట బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గుమ్మం వద్దే సేవలు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల గుమ్మం వద్దే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం దిగువపల్లిలో ప్రారంభమైన ప్రజా సంక్షేమయాత్ర తేరన్నపల్లి, రావివెంకటాంపల్లి, పెద్దపొలమడలో సాగింది. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యేకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోపాటు సీఎం జగనన్న రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషి వివరించారు. అంతకుముందు దిగువపల్లిలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆయా శాఖలకు నూతన భవనాలను గ్రామాల్లోనే ఏర్పాటు చేశారన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ సేవలతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఏ పని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే వారన్నారు. ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి ముంగిటే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు.

అభివృద్ధికి అండగా నిలవండి

నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుంచి అభివృద్ధిపై దృష్టి సారించానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులను పూర్తి చేశామని, మరిన్ని పనులు కొనసాగుతున్నాయన్నారు. అయితే టీడీపీ నాయకులు అభివృద్ధి పనులకు అడుగడుగునా అడ్డుతగులుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పించడం ద్వారా అభివృద్ధికి అండగా నిలవాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. పెద్దపొలమడ ఉన్నత పాఠశాల ఆవరణలో వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ రంగారావు, జెడ్పీటీసీ రమణమ్మ, సర్పంచులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, ఎంపీటీసీ కిశోర్‌రెడ్డి, నాయకులు కాశీ, సాయి, రమేష్‌నాయుడు, సుధాకర్, మోహన్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతుల భూములకు శాశ్వత రక్షణ



రీసర్వేను ప్రారంభిస్తున్న శ్రీరామిరెడ్డి



రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లు రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమంతో రైతుల భూములకు శాశ్వత రక్షణ కలుగనుందని ఆర్డీఓ రవీంద్ర తెలిపారు. గురువారం దంచర్ల గ్రామంలో రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమం ద్వారా ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు సైతం పరిష్కారం కానున్నాయన్నారు. రైతులు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం గ్రామంలో తహసీల్దార్ రాము, రీసర్వే డీటీ ఆదినారాయణ, సర్వేయర్ మారెప్ప ఆధ్వర్యంలో చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు.

యాడికి: భూముల రీ సర్వే పనులు వివాదరహితంగా సాగాలని తహసీల్దార్ అలెగ్జాండర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు పేర్కొన్నారు. గురువారం కుందన కోట, ఓబుళాపురం, వేములపాడు, నగరూరు, కమలపాడు, రాయలచెరువు, చందన, తూట్రాళ్లపల్లె, పుప్పాల, కోనుప్పలపాడు, యాడికిలో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ అలెగ్జాండర్, డీటీ బాలమ్మ, రీ సర్వే డీటీ రాజ్ కుమార్, సీఎస్‌డీటీ సూర్యనారాయణ ఆయా గ్రామాల్లోని సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి వైఎస్సార్ జగనన్న భూ సర్వే భూ రక్ష పథకం ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం ఓబుళాపురం, తూట్రాళ్లపల్లెలో రీసర్వే ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, సర్పంచు సంజీవరాయుడు, రుక్మాంద రెడ్డి, ఓంకారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పామిడి: సొరకాయలపేట, రామగిరి గ్రామాల్లో గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంపై గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి మాట్లాడుతూ రైతులు భూసర్వేకు సహకరించాలని కోరారు. ఆర్‌ఐ క్రాంతికుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని చెన్నవరంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని గురువారం డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోవిందరాజులు, సర్పంచ్ వెంకట్రాముడు, వీఆర్వో విష్ణువర్ధన్‌రెడ్డి, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో భూముల రీ-సర్వేని పకడ్బందీగా చేపట్టాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర సూచించారు.

గురువారం ఎంగిలిబండ, ధర్మాపురం, తురకపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూ రీ-సర్వేని ఆర్డీఓ రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వే చేస్తున్న గ్రామ సర్వేయర్లకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, ఆర్‌ఐ సందీప్ పాల్గొన్నారు.

ఇంటి పట్టాల మంజూరుకు కృషి



అధికారులతో మాట్లాడుతున్న శంకర్ నాయక్

గుత్తి: పట్టణంలోని ఇళ్లు లేని 17 మంది గిరిజనులకు కలెక్టర్‌తో మాట్లాడి ఇంటి పట్టాలు మంజూరు చేయిస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ హామీ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే పట్టణంలోని తాడిపత్రి రోడ్డు సమీపంలో సర్వే నంబర్ 728లో ఉన్న ప్రభుత్వ స్థలంలో 17 మంది కొన్ని రోజుల క్రితం ఇంటి నిర్మాణాల కోసం పునాదులు తవ్వుకున్నారు. అయితే రెవెన్యూ అధికారులు మూడు రోజుల క్రితం పునాదులను తొలగించారు. దీంతో గిరిజనులు ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్టీ కమీషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ గురువారం గుత్తికి వచ్చి తహసీల్దార్ మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ సందీప్, వీఆర్వో పవిత్ర, ఎంఈఓ రవి నాయక్ తదితరులతో కలిసి గిరిజనులు పునాదులు వేసుకున్న స్థలాలను పరిశీలించారు. అనంతరం వడిత్యా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కలెక్టర్‌తో మాట్లాడి 17 మంది గిరిజనులకు ఇంటి పట్టాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఐదుగురి బైండోవర్

గార్లదిన్నె: అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న కృష్ణాపురం, కొప్పలకొండ, శిరివరం గ్రామాలకు చెందిన ఐదుగురిని గురువారం తహసీల్దార్ ఉషారాణి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు. మరోసారి ఇసుక రవాణా చేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా శింగనమల మండలం తరిమెల నుంచి రామాంజనేయులు అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వీఆర్‌ఏల వేతనాలు పెంచాలి

గుంతకల్లుటౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల వేతనాలను పెంచాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నూలు అంజి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో గుంతకల్లు డివిజన్ వీఆర్‌ఏల సమావేశం జరిగింది. వీఆర్‌ఏల వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలని, పదోన్నతులు కల్పించాలని, వారసత్వాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణా ప్రభుత్వ తరహాలో వీఆర్‌ఏలకు పే స్కేల్ ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం గుంతకల్లు డివిజన్ వీఆర్‌ఏల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సాకే నాగరాజు, అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజు, ఉపాధ్యక్షుడిగా రాజశేఖర్‌ను ఎన్నికయ్యారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వెబ్ కౌన్సెలింగ్ కేంద్రం

తాడిపత్రి టౌన్: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో వెబ్ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ అభ్యర్థులు ఈనెల 25 నుంచి జూన్ 1వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు(ఓసీ, బీసీ రూ.700, ఎస్సీ, ఎస్టీ, రూ.250) చెల్లించి రసీదు పొందాలని పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి జూన్ 5 వరకు ధ్రువ పత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. వివరాలకు హెల్ప్ లైన్ నంబర్ 9493773778 వినియోగించుకోవాలని సూచించారు.

ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని స్కిల్ హబ్‌లో ఉచిత నైపుణ్య శిక్షణతోపాటు శిక్షణ పూర్తయిన వారు ఉద్యోగాల కోసం దరఖాస్తు సుకోవచ్చని స్కిల్ హబ్ ఏడీ గోవిందరాజులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన వారికి ఉచితంగా ల్యాండ్ సర్వేయింగ్‌పై శిక్షణ, టెన్త్, ఐటీఐ పాసైన వారికి ఉచితంగా ఎలెక్ట్రీషియన్ శిక్షణ, టెన్త్ పాసైనా లేకపోయినా ప్లంబింగ్, శానిటేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో చేరేవారు, శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఉద్యోగ అవకాశాల కోసం ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు 7013858450, 7013425587 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గార్లదిన్నె: ముంటిముడుగు క్రాస్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం కోళ్ల వ్యాన్ బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురంలోని కోళ్ల ఫారం నుంచి నవీన్‌కుమార్, ఆంజనేయులు వ్యాన్‌లో కోళ్లు వేసుకొని పామిడి వైపు బయలుదేరారు. ముంటిముడుగు క్రాస్ సమీపంలో అతివేగంతో వాహనం అదుపుతప్పిబోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ నవీన్‌కుమార్, క్లీనర్ ఆంజనేయులును 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు బెంగళూరు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ పేర్కొన్నారు.

శింగనమలలో 'సాగుబడి'

శింగనమల: శింగనమల చెరువు కింద పంటలు బాగా పండాలని కోరుతూ రైతులు గురువారం సాగుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ఆలయాలు, బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెరువు కింద పొలాల్లో గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

యాడికి: రాయలచెరువులో యాడికి రైల్వే గేట్ వద్ద రైలు పట్టాలపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు గుత్తి జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

కేసు నమోదు

యాడికి: నగరూరులో గురువారం సాయంత్రం ఇంటి వద్ద కరెంట్ స్తంభం పాతే విషయంలో కల్యాణితో పాటు ఆమె భర్తపై అదే గ్రామానికి చెందిన ఆదినారాయణ, నారాయణ స్వామి, వీరన్నతో పాటుమరో ముగ్గురు కలిసి చేతులు, కాళ్లతో దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ముగిసిన ఆర్డీటీ సాంస్కృతిక ఉత్సవాలు

బుక్కరాయసముద్రం: ఆర్డీటీ బధిరుల పాఠశాలలో గురువారం ఆర్డీటీ సెంట్రల్ లెవల్ సాంస్కృతిక ఉత్సవాలు ముగిశాయి. ఈసందర్భంగా విద్యార్థులు వివిధ ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఉత్సవాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సంస్థ బహుమతులను అందజేసింది.

సీఎం వైఎస్ జగన్‌తోనే స్వర్ణయుగం



మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్‌రావు

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ప్రభుత్వ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందని ఏపీ రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. గురువారం రాత్రి ఆయన ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు స్వగృహంలోని తేనేటివిందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కులమత, పార్టీ అన్నబేధం లేకుండా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ సాగిస్తున్న పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. జగనన్న కాలనీలతో పేదల సొంతింటి కల సాకారమవుతోందన్నారు. మోసకారి మాజీ సీఎం చంద్రబాబు, అతని దత్త, ప్యాకేజీ పుత్రుడు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను నమ్మి మోసపోవద్దన్నారు. ఏమాత్రం రాజకీయ పరిణితి లేని నారా లోకేష్ పాదయాత్ర ప్రజల్లో అభాసుపాలు అవుతోందన్నారు. అంతకుముందు జూపూడిని ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు పుష్పగుచ్ఛంతో సాదరంగా స్వాగతించారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కే వెంకటచలపతి, ఎస్సీసెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో మహిమ సువార్త మహాసభలు

గుత్తి: పట్టణంలోని లచ్చానపల్లి రోడ్డులో ఉన్న బైబిల్ మిషన్ చర్చి(అద్భుత కుమార్ స్వస్థత శాల)లో గురువారం మహిమ సువార్త మహాసభలు జరిగాయి. కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సామాజిక సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్, ఆయన సతీమణి మణికుమారి, పలువురు పాస్టర్లతో కలిసి జూపూడి సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ బైబిల్ మిషన్ చర్చి దేశంలోనే అతి పెద్దదన్నారు. ఇక్కడ సువార్త సభలో పాల్గొనే అవకాశం రావడంతో సంతోషంగా ఉందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సచివాలయ సిబ్బంది, అధికారులతో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

యల్లనూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, సర్పంచ్ పెద్ద ఓబులమ్మ అన్నారు. గురువారం యల్లనూరు సచివాలయం-2ను ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నాటి చంద్రబాబు పాలన, నేటి జగనన్న పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. సచివాయ వ్యవస్థతో ప్రజలకు గ్రామాల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఓబులేసు, ఉప సర్పంచ్ సూర్యనారాయణ, మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా, సచివాలయ కన్వీనరు జాఫర్, నిట్టూరు నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి , తహసీల్దార్ రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, పంచాయతీ కార్యదర్శి గీతా, వీఆర్వో హేమలత పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి

యాడికి: మండలంలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధికారులను ఆదేశించారు. గురువారం యాడికి మండల పరిషత్ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సమస్యలపై అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు ఆరా తీయడంతోపాటు వాటిపై సచివాలయానికి సమాచారం అందించాలన్నారు. సాధ్యమైనంత త్వరగానే సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు విద్యుత్, డ్రైనేజీ సమస్యలతోపాటు వైద్యులు సమయపాలన పాటించడం లేదంటూ సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారు. అంతకుమునుపు అధికారులు తమ శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీలు హసీనాబేగం, చెన్నప్ప, ఎంఈఓ కాశెప్ప, ఏఓ మహబూబ్ బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.